
# రాంపండూ - క్షతగాత్రులూ



"అచలపతీ! నీకు మరొక్క అవకాశం ఇస్తున్నాను. ఆ బొమ్మకేసి నిదానంగా చూసి నీ అభిప్రాయం మార్చుకో. తక్కిన విషయాలలో నువ్వు ఫరవాలేదనుకో. కానీ ఆర్ట్ విషయంలో కాస్త వీక్. నీ పురాతన భావాలు పక్కనపెట్టి దానిమీద ఫ్రెష్‌లుక్ వేయి".

హితవు చెప్తున్నది అనంత్. అచలపతి అభిప్రాయం మార్చుకోవలసినది రమ్య గీసిన అనంత్ పెయింటింగ్ మీద. సుమనోహరి పుస్తకం గొడవ లేకపోతే రమ్యకి అనంత్ బొమ్మవేసే అవకాశమే రాకపోవును!

పబ్లిషరు దొరకడంతో సుమనోహరి పుస్తకం కాస్త ముందంజ వేసింది. ఆ పుస్తకం కవరు పేజీ వేయమని తన ఫ్రెండు రమ్యని అడిగింది సుమనోహరి. ఆ సందర్భంలోనే ఈమెను రాంపండుకి (అనంత్‌కి కూడా) పరిచయం చేసింది.

అప్పటిదాకా ఏ కళాకారుడు (కళాకారిణి అయితే – సమస్యే లేదు) అనంత్‌ను చూసి బొమ్మ వేయడానికి ముచ్చట పడలేదు. కానీ రమ్య పడింది. ఆ ముచ్చట చూసి అనంత్ ముచ్చట పడ్డాడు. పదిరోజుల శ్రమ తర్వాత ఆమె వేసిచ్చిన ఆయిలు పెయింటింగు చూసి మరీ ముచ్చట పడ్డాడు.

కానీ అది అచలపతి అభిశంసనకు గురయ్యింది. ఆ బొమ్మలో ఉన్నవి 'ఆకలి చూపుల'ని అన్నాడతను. అనుకోకుండా ఎముక కలలోకి వచ్చిన కుక్క చూపులతో వాటిని పోల్చవచ్చని కూడా అన్నాడు. దాన్ని ఫ్రేము కట్టించి మెయిన్ హాల్లో పెట్టే అనంత్ ప్రయత్నాలను సున్నితంగానే ప్రతిఘటిస్తున్నాడు.

తన ఆలోచనలను పునర్విమర్శ చేసుకోవాలని ఇప్పుడు అనంత్ మళ్లీ విజ్ఞప్తి చేసినా అది వ్యర్థమయినట్టే ఉంది. ఐదు నిమిషాల దీర్ఘాలోచన తర్వాత అచలపతి తల విదిలించాడు.

తన సహచరుడికి అనంత్ ఇంకో అవకాశం ఇవ్వదలిచేడు. "చూడు, నేను క్లబ్బుకి వెళ్లి ఓ గంట తర్వాత తిరిగి వస్తాను. ఈలోపున బాగా ఆలోచించుకుని, నేనన్నదానికి సరేనను" అని బయటకు వెళ్లిపోయేడు.

గంట తర్వాత తిరిగి వచ్చాక ఆ పెయింటింగు గురించి అనంత్ అడిగే లోపునే అచలపతి చల్లగా ఓ బాంబు పేల్చాడు–

"రాంపండు గారు వచ్చి వెళ్లారు సర్"

రాంపండు వచ్చిన ప్రతీసారి ఏదో ఒక ముప్పును వెంట బెట్టుకురావడం అనంత్‌కి అనుభవానికి వచ్చిన సత్యం. అందువల్ల కాస్త బెదురుతూనే అడిగాడు–

"మళ్లీ వస్తానన్నాడా?"

"అడగలేదండి. సమాధానం చెప్పే మూడ్‌లో లేరండి".

"ఏం పాపం?"

"ఏక్సిడెంటు వల్ల చాలా డిస్టర్బ్ అయినట్టు కనబడ్డారు సర్'

"అయ్యో! ఏక్సిడెంటా? దెబ్బలు తగిలాయా?"

"కొద్దిగా తగిలాయి సర్. ఆయనకు కాదు. ఆయన తెచ్చినాయనకి!"

"ఆయనెవడు? ఎక్కడున్నాడు?"

"మీ బెడ్‌రూమ్‌లో సర్"

అనంత్ వెంటనే అక్కడికి పరిగెట్టాడు. అక్కడ ఓ ఆజానుబాహువు, గిరజాల జుత్తువాడు, అందగాడు, అనంత్ పక్కమీద పవ్వళించి వున్నాడు. సినిమా హీరో స్టయిల్‌లో, నుదిటికి ఈశాన్యమూల ఓ చిన్న ప్లస్ మార్కు పట్టీ ఉంది. కుడి చేత్తో ఓ ఆపిల్ పండు కొరుక్కుతింటూ ఎడం చేతిలో ఓ డిటెక్టివ్ పుస్తకం పట్టుకుని చదువుతున్నాడు. అన్నిటికంటె ఘోరం, అతనూ అనంత్ పైజమా, షర్టు వేసుకుని ఉన్నాడు. అనంత్ అడుగుల చప్పుడు వింటూనే తలెత్తి చూసి పలకరించాడు.

"హాయ్! అనంత్! ఈ పరుపేమిటి? ఇలాంటిది కొన్నావ్?"

అనంత్ పళ్లు పటపటలాడించేడు. "తమరు...?" అన్నాడు వెటకారం ధ్వనిస్తూ.

"ఫల్గుణ్! మీ పనివాడు చెప్పలేదా? పట్టి చవటలా ఉన్నాడే! ఈ పాటికి నా గురించి, నా అనారోగ్యం గురించి అంతా చెప్పే వుంటా డనుకొన్నానే!"

కోపాన్ని అణుచుకుంటూ అనంత్ అడిగాడు "తమరి అనారోగ్యం అంటే... ఆ పట్టీయేనా?"

"హారినీ! డాక్టరు వచ్చి కనీసం వారం రోజులయినా ఇక్కడ, ఇలాగే కాలు కదపకుండా పడి వుండాలని చెప్పిన విషయం మీ వాడు చెప్పలేదా? బట్, లెట్మీ టెల్యూ. ఈ పరుపు మార్చకపోతే వారం రోజుల పాటు ఇలా వుండడం నా తరం కాదు".

"వారం రోజులా! అదీ నా పక్క మీద!"

"అంత గట్టిగా అరవకు అనంత్! బాగా రెస్టు తీసుకోమని మరీ మరీ చెప్పాడు డాక్టర్. పైగా ఈ డిటెక్టివ్ నవల చదువుతూ అసలే టెన్షన్‌లో ఉన్నానా నువ్విలా అరిచి హడలగొడితే నా గుండెకేమైనా కావచ్చు. సరే, సరే నీతో ఈ డిస్కషన్ పెట్టుకునేంత టైము నాకులేదు. వ్యవహారాలు చప్పున తెమల్చుకుని నువ్వు బయటకు వెళితే నేను కాస్సేపు కునుకు తీస్తాను".

"ఎవడా చెప్పిన డాక్టరు? పైగా నీతో నాకు వ్యవహారాలేమిటి?" అనంత్ మళ్ళీ అరిచాడు.

"వ్యవహారం ఏమిటేమిటి? ఈ ఏక్సిడెంటు గురించి మనమో అండర్‌స్టాండింగ్‌కి రావాలి. లేకపోతే మా అక్క దగ్గర పేచీ వస్తుంది"

"మీ అక్కెవరు?"

"దుర్గక్క. దుర్గా సూప్స్ ప్రొప్రయిటర్ కుచేరరావు లేడూ, అతని భార్య. నేనంటే పడి ఛస్తుంది".

"అదేం పాపం? నువ్వొక్కడివే తమ్ముడివా?"

"కాదు మేం అరడజను మంది ఉన్నాం. అందరిలోకీ చిన్నవాణ్ని నేను. పైగా పెళ్లికాలేదు. అందుకని."

"అయితే నాకేమిటి?"

ఫల్గుణ్ తెల్లబోయి చూశాడు, తర్వాత అర్థం చేసుకున్నట్టు చిరునవ్వు నవ్వాడు.

"నిన్ను మందబుద్ధి అని అందరూ ఎందుకంటారో నాకు ఇప్పుడు తెలిసింది.

నేను విపులంగా చెప్తాను విను. మా అక్క నా మీద ఈగ వాలినా సహించలేదు. మరి కారు వాలితే సహించగలదా? లేదు. నాకీ ఏక్సిడెంటు చేసిన వాణ్ణి కోర్టు కీడ్చి నానా రభసా చేస్తుంది".

"అవును చేస్తుంది"

"చేస్తుంది కదా! మరి దాని వల్ల నష్టపోయేది ఎవరు? సుమనోహరి - అందాల సుమనోహరి".

కథ ఎటుపోతుందో అనంత్‌కి అర్థం కాలేదు. "దీన్లో సుమనోహరి ఎక్కణ్నించి వచ్చింది?"

"వాళ్లింటి నుంచి! 'రమ్య వేసిన అనంత్ బొమ్మ చూపిస్తా రా' అంటూ మీ ఇంటికి రమ్మనమంది. నేను మీ ఇంటికి వస్తుండగానే మలుపులో కార్లో వచ్చి గుద్దేసింది."

ఓహో, సుమనోహరి లేనిదే ఏ ట్రాజెడీ ఉండదు కదా అనుకుని అనంత్ నిట్టూర్చి "మరి రాంపండు ఎక్కణ్నుంచి వచ్చాడు?"

"సుమనోహరితో బాటు ఆ కారులోనే ఉన్నాడు కదా. వేరే ఎక్కణ్నుంచో రావడం ఎందుకు?"

"ఓహో ఇద్దరు కబుర్లు చెప్పుకుంటూ వచ్చి నీ మీద కారెక్కించేశారన్న మాట"

"కబుర్లు చెబుతూ కాదు. కళ్లు మూసుకుని కూడా కారెలా డ్రైవ్ చేయవచ్చో సుమనోహరి డిమాన్‌స్ట్రేట్ చేస్తుండగా".

"ఇక నాకు అర్థమయ్యింది. సుమనోహరికి డ్రైవింగ్ లెసెన్సు లేదు కాబట్టి, రాంపండు త్యాగం చేసి ఆ యాక్సిడెంటు నేరాన్ని తన నెత్తిమీద వేసుకుని, ఆ బాధితుడి భారాన్ని నా నెత్తిమీద పడేసి పోయాడు. అంతేనా?"

"దాదాపు అంతే. ఓ చిన్న అదనపు సమాచారం. ఆ త్యాగాన్ని చేయమని రాంపండుని ప్రోత్సహించినది సుమనోహరే. క్షణాల మీద అంత చక్కటి ఆలోచన చేసిన సుమనోహరి మా దుర్గక్క కారణంగా చిక్కుల్లో పడుతుందంటే నేను సహించలేను".

"పోనీ రాంపండు చేశాడంటే..."

"అప్పుడు సుమనోహరికి రుచించక పోవచ్చు. ఎందుకొచ్చిన గొడవ. ఆ విషయం ప్రస్తావించకుండా ఊరుకుంటె పోయె. మనం ఒక పెద్ద మనుష్యుల ఒప్పందానికి ఒద్దాం. ఫోన్ చేశా. అక్క వచ్చి అడిగినా అంతా గప్‌చిప్... ఓ.కే."

"అసలు ఆవిడకు తెలియాల్సిన అవసరం ఏముంది?" అనంత్‌కి అనుమానం వచ్చింది.

"తెలియపరచకపోతే నన్ను తిడుతుంది. అనుక్షణం నన్ను కంటికి రెప్పలా కాపాడుతుంది. నాకెవరైనా హాని తలపెడితే ఆడపులిలా తిరగబడి చంపేస్తుంది. అందుకని నన్ను గుద్దేసిన కారు నెంబరు చూడలేదని చెప్తానులే. ఓకే అనంత్! లీవ్ మీ నౌ. డాక్టరు రెస్టు తీసుకోమన్నాడు. పైగా ఈ డిటెక్టివ్ పుస్తకంలో విలన్ మన హీరోయిన్ బెడ్ రూమ్ వెంటిలేటర్లోంచి ఓ పాము లోపలకి పడేశాడు. నేను తక్షణం దాని సంగతి చూడాలి. నాకేదైనా అవసరం వస్తే పిలుస్తానులే. ఇక వెళ్లు" అని పుస్తకంలో మునిగిపోయాడు.

అనంత్ బయటకు వస్తూనే "అచలపతీ తల పగిలిపోతుంది. కాస్త నిమ్మరసం తీసియ్యి. ఈ ఫల్గుణ్‌గాడి పురమాయింపులు భరించలేను. వెళ్లి క్లబ్బులో కూచుని పేకాడుకుంటాను. నన్ను వీడి పాల పడేసినందుకు రాంపండు గాడికో చిన్న కోటింగు ఇవ్వాలి. హోటల్‌కి వచ్చి కలవమను" అన్నాడు.

రాంపండు అనంత్ కంటపడడానికి రెండు గంటలు పట్టింది. ఈ లోపున క్లబ్బులో చక్కటి భోజనం అమిరింది. రాంపండు కనబడగానే నమిలి మింగేద్దామన్న కోపం అతను కంటబడగానే కాస్త కరిగింది. తుఫాను దెబ్బ తిన్నా ప్రభుత్వ సాయం అందని రైతులా ఉన్నాడు రాంపండు. ఏమయిందన్నాడు అనంత్.

'సుమనోహరితో నా ప్రేమ ఫలించదేమోరా' అని బావురుమన్నాడు రాంపండు.

"ఏం?"

"ఏవేమిటి? అక్కడ ఫల్గుణం గాడు అలా మంచం మీద పడివుంటే నాకేసి ఏం చూస్తుందిరా? ఆడవాళ్ల కసలే జాలిగుండె. తన చేతుల్తో క్షతగాత్రుడిని చేసిన వాడు పాలిపోయిన మొహం వేసుకుని, రెండు దిళ్లు ఆసరాగా అమర్చుకుని, పళ్ల రసం తీసే గాజు పళ్లాన్ని పక్కన స్టూలు మీద పెట్టుకుని మంచి ఇంట్రెస్టింగ్‌గా కనబడుతూంటే నాకేసి కన్నెత్తి చూస్తుందా? గదిలోకి వెళ్లి వాణ్ని చూసి, గుండె కరిగి, వాడి కాళ్లొత్తి త్యాగమూర్తిగా, సతీ సుమనోహరిగా చరిత్ర కెక్కేద్దామని నిశ్చయించుకుని గది బయటకు వస్తుంది. బయట ఉన్నదెవరు? ఆపిల్‌పండు ఏడ్‌లో మోడల్‌లా కనబడే రాంపండు. ఒళ్లు మందదూ? అసలు ఇంతంత ఆరోగ్యాలతో మనుష్యులు ఎలా వుంటారు బాబూ అని చికాకు పడుతుంది కూడా..."

"పోనీ నువ్వు కూడా ఏదైనా జలుబూ, రొంపా..."

"లాభం లేదురా. వాడు కాలు విరిగిన కేసు. సింపతీ ఫ్యాక్టరంతా పోగేసుకుని కూచున్నాడు. అందునా వాడు మహా గొప్ప యాక్టరులే. అయిపోయింది, నా పని అయిపోయింది." అంటూ రాంపండు తల పట్టుకుని కూచున్నాడు. అంతలోనే అనంత్‌కి తలలో బల్బు వెలిగింది.

"ఒరేయ్ రాంపండూ, కంగారు పడకు. నువ్వు చెప్పేది జనరల్‌గా కరక్టే కానీ అన్ని విషయాలలోను అలా ఉండాలని లేదు. కాలు విరక్కొట్టుకున్న ప్రతీ మగాడ్ని ఆడది ప్రేమించాలని లేదు. ముందులో అయ్యోపాపం అనిపించినా, రెండు సార్లు కాళ్లు ఒత్తి, మూడుసార్లు టెంపరేచరు తీసేసరికి ఉత్సాహం చల్లబడుతుంది. రాత్రులు మేలుకుని, మంచం కోడు మీద తల పెట్టుకుని కునికిపాట్లు పడుతున్నప్పుడు హఠాత్తుగా అనిపిస్తుంది. రోడ్డు మీద సవ్యంగా నడవడం కూడా రానివాణ్ని కట్టుకుని జీవితాంతం ఏం సుఖపడతాను అని, కారు మీదకు వస్తుంటే ఓ గెంతు గెంతి తప్పించుకోవాలన్న కామన్‌సెన్స్ కూడా లేనివాడు తమకు పుట్టబోయే పిల్లల్ని స్కూలుకి సరిగ్గా తీసుకెళ్లగలడా? అని పళ్లరసం తీస్తూ దీర్ఘాలోచనలో పడుతుంది..."

"...అంతేకాదు, ఇలా చీటికిమాటికి కాలు విరక్కొట్టుకునేవాడిని పెళ్లి చేసుకుని శేష జీవితాన్ని హాస్పటల్‌కీ, పళ్ల మార్కెట్‌కీ మధ్య రౌండ్సు కొడుతూ గడపాలా అని కూడా ఆలోచిస్తుంది. అంతకంటె హాయిగా గుమ్మడిపండు లాటి రాంపండుని కట్టుకుంటే తనే మంచం ఎక్కవలసి వచ్చినా ఫర్వాలేదు కదాని ధైర్యం తెచ్చుకుంటుంది..." అంటూ అందించాడు రాంపండు.

"కరెక్ట్. ముఖ్యంగా సుమనోహరి వంటి ప్రాక్టికల్ మనిషి ఇలాటి త్యాగమూర్తి వేషాలు వేయదు".

"అంటే త్యాగమూర్తులంటే గౌరవం కూడా లేదంటావా? ఎదటివాళ్లు తన కోసం త్యాగం చేస్తున్నారన్నా బోనస్ మార్కులు వేయదంటవా?"

"ఖచ్చితంగా! ఇలాటి సెంటిమెంటల్ ఫూల్స్‌ని కట్టుకుని సుఖపడలేననుకుంటుంది కూడా".

"థాంక్స్‌రా. చాలా గొప్ప విషయం చెప్పి నా కళ్లు తెరిపించావ్." అని రాంపండు పరిగెట్టుకుని వెళ్లిపోయాడు. అప్పుడు కూడా అనంత్‌కి తన గొయ్యి తనే తవ్వుకుంటున్నట్టు అనుమానం రాలేదు.

***

ఇంకో గంట పోయాక అనంత్ ఇల్లు చేరేసరికి ఫల్గుణుడి అక్క దుర్గగారు వచ్చి కాసేపు కథాకళి చేసి వెళ్లిందని, అనంత్‌ని ఎలాగైనా చూడాలని తహతహలాడిందని అచలపతి చెప్పాడు.

"థ్యాంక్స్ చెప్పడానికా?" అని అడిగేడు అనంత్.

"ఆవిడ ఉపయోగించిన భాష చూస్తే అలా అనిపించలేదు సర్" అన్నాడు అచలపతి.

ఈ డిప్లమాటిక్ భాషను డీకోడ్ చేసుకొనే ఓపిక లేక "ఇంతకీ మన క్షతగాత్రుడు బతికున్నాడా?" అన్నాడు విసుగ్గా.

"ఐదు నిమిషాల క్రితమే బెల్లు కొట్టి పిలిచి 'ఈ కొంపలో ఇంతకంటె మంచి బ్రాండ్ సిగరెట్టు లేదా?' అని అడిగేరండి."

అనంత్‌కి ఒళ్లు మండిపోయింది. చరచర తన బెడ్‌రూమ్‌లోకి దూసుకుని వెళ్లాడు.

పేషంటు గారు సిగరెట్టు ఊదుతూ, డిటెక్టివ్ పుస్తకం చదివేస్తున్నాడు. అనంత్‌ను చూస్తూనే, "రా, రా, అనంత్. వెల్‌కమ్ హోమ్. హీరోయిన్ గదిలో విలన్ తాచుపాము పడేసేడని నేను చెప్పినప్పటినుండి నువ్వు పాపం వర్రీ అవుతున్నావేమో, నో ప్రాబ్లెమ్. ఇది ముందుగానే ఊహించి హీరో ఆ పాము కోరలు పీకేసాడు..." అని ఏదో చెప్పబోయేడు.

"డోంట్ బాదర్ ఎబౌట్ తాచుపాములూ, నాచుపాములూ...." అని విసుక్కున్నాడు అనంత్.

ఫల్గుణుడు మందలించాడు. "తాచుపాముల్ని అంత తేలిగ్గా తీసిపారేయకు. హీరో కోరలు తీసేసేడు కాబట్టి సరిపోయింది. లేకపోతే పాపం హీరోయిన్ ఈ పాటికి ఎక్కడుండేదో. అన్నట్టు, దుర్గక్క వచ్చింది. నీతో మాట్లాడాలంది. నువ్వెక్కడికి పోయావ్? పాపం చాలాసేపు వెయిట్ చేసింది".

"నాతో ఆవిడకి మాట్లాడాల్సిన విషయా లేమున్నాయి?" అయోమయంగా అడిగేడు అనంత్.

"ఉందిలే. కాస్సేపటి క్రితమే రాంపండు వచ్చాడు. ఇద్దరం కలిసి మా దుర్గక్క వస్తే ఎలా చెప్పాలా అన్న విషయం రిహార్స్ చేస్తూ ఉంటే ఒక విషయం తట్టింది. నీకు గుర్తుందా? యాక్సిడెంట్ ఎవరు చేశారో అక్కకి చెప్పకుండా ఎవరో నన్ను గుద్ది వెళ్లిపోయారని చెప్దామనుకున్నాం కదా. కానీ మీ ఇంట్లో భోంచేసి ఈ మంచం మీద పడుక్కుని వాసాలు లెక్కపెడుతూ ఉంటే నాకు హఠాత్తుగా తోచింది - ఇలా చెబితే అక్క నమ్మదని, మరి దాని గురించి ఏం చేద్దామాని అనుకుంటూంటే రాంపండు ఓ ఐడియా ఇచ్చాడు. ఈ యాక్సిడెంటు నువ్వు చేసావని చెబితే సరిగ్గా అతుకుతుందని. నిజమే కదా, నువ్వు యాక్సిడెంటు చేశావు కాబట్టే నీ ఇంట్లో పెట్టుకుని సేవలు చేస్తున్నావని చెబితే ఎవరైనా నమ్ముతారు".

"హారి రాంపండూ!" అనుకుని అనంత్ నిర్ఘాంత పోయాడు. "మరి సుమనోహరి నేరాన్ని తన నెత్తిమీద వేసుకుని త్యాగమూర్తిలా ఆమె దగ్గర ఫోజు కొట్టి..."

"అబ్బే, ఆ త్యాగాల వేషాలకు గిరాకీ లేదు పొమ్మన్నాడు రాంపండు. నువ్వని చెప్పేయమన్నాడు. నేను చెప్పేశాను. కానీ దుర్గక్క ఆ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోలేక పోయింది. తన తమ్ముణ్ని అవిటివాడిని చేసిన ఆ దుష్టుణ్ని పట్టుకుని... అదేమిటి అనంత్, అలా పళ్లు నూరుకుంటున్నావ్. అది చాలా బ్యాడ్ హేబిట్. నాకు చిన్నప్పుడు ఆ అలవాటు ఉంటే లెక్కల మేష్టారు చెప్పి మాన్పించాడు. నీకు లెక్కల సబ్జక్ట్ ఉండేది కాదా...?"

"నాకు తెలిసి నీకు కాలు బెణకడం తప్ప ఏ రోగమూ లేదు. ఆ మాత్రానికి అవిటితనమూ, దానికో అక్కగారి సింపతీనూ...." పళ్ల మధ్య నుండే మాట్లాడాడు అనంత్.

"ఏమో బాబూ, మా అక్క సంగతి ముందే చెప్పాను. చాలా కోపిష్ఠి. రేపు మళ్లీ వస్తుందట. ఈసారి నిన్ను కలవకుండా వెళ్లనంది. మా బావ కూడా ఊర్నించి తిరిగి వస్తున్నాడు. మా అక్క ఎంత చెబితే అంత తనకి. కేసు పెట్టు, వీణ్ని నాశనం చేసేయ్ అని అక్క అంటే చేసి తీరతాడు. చెప్పానుగా. బోల్డంత డబ్బు, పలుకుబడి, అన్నీ ఉన్నాయి. ఈలోగానే మా అక్కను మంచిచేసుకో. చల్లబడుతుంది. లేకపోతే నీ పని అంతే సంగతులు." అని చెప్పేసి టేబుల్ మీద ద్రాక్షపళ్లు ఒక్కోటి తీసుకుని నోట్లో వేసుకోసాగాడు ఫల్గుణ్.

అనంత్‌కు ముచ్చెమటలు పట్టాయి. కాస్సేపు ఆలోచించి, 'ఇంతకీ మీ అక్కను మంచి చేసుకోవడం ఎలా?"

"సింపుల్, ఆడవాళ్లను మంచి చేసుకోవడానికి ఉండే స్టాండర్డ్ ఫార్ములా - పూలు! అక్కకి గులాబీలంటే ప్రాణం. గులాబీలతో కట్టిన బొకే ఇప్పుడే పంపించేసేయ్. ఫోన్‌లో

ఆర్డరిస్తే చాలు వాళ్ల ఊళ్లో గుమ్మం దగ్గరి అందచేసే ఏజన్సీలు చాలా ఉన్నాయి. రేపు తను వచ్చినప్పుడు నవ్వుతూ వస్తుంది. ఏదో పొరబాటయిందని చెప్పేసి చేతులో, కాళ్లో పట్టేసుకో. విషయం క్లోజ్. అనంత్, డాక్టరు నన్ను ఎక్కువ సేపు మాట్లాడద్దన్నాడు. రెస్టు తీసుకోమన్నాడు. అందువల్ల ప్లీజ్ లీవ్ మీ ఎలోన్".

***

ఫల్గుణ్ చెప్పినట్టు గులాబీలు పంపించడం వల్ల ప్రభావం కనబడింది. మర్నాడు అనంత్ నిద్ర లేచేసరికి కుబేరరావు సిద్ధంగా ఉన్నాడు!

కుబేరరావు గ్రీకువీరుడి ఫిజిక్. ఏదైనా మాట్లాడాలన్నా నాలుగు తన్నాక మాట్లాడచ్చులే అనుకునే రకంలా ఉన్నాడు. అంత డబ్బు ఉన్నవాడికి అంత గూండా లుక్ ఎలా వచ్చిందాని ఆశ్చర్యం వేసింది అనంత్‌కి. పలకరించబోతే కసురుకుంటున్నాడు. ఏం చేయాలో తెలియక అనంత్ ఊరుకున్నాక–

"అసలు సంగతి కొద్దామా?" అన్నాడు కుబేర్రాడీ.

'ఓహో, మీదాకా వచ్చిందా?" అన్నాడు అనంత్ కాస్త ఆశ్చర్యపడుతూ.

"మా ఆవిడ ఏ విషయమూ నా దగ్గర దాచదు తెలుసా?" అన్నాడు కుబేరుడు కాస్త గర్వంగా.

"ఏదో చిన్న విషయం కదా, చెప్పి వుండరనుకున్నా..."

కుబేర్రావు ఒక్క గెంతు గెంతాడు. "ఏమిటి చిన్నవిషయమా? నేను ఊళ్లో లేకుండా చూసి మా ఆవిడకు గులాబీలు పంపి, ప్రేమలేఖలు రాసి విసిగించడం చిన్న విషయమా?"

వాస్తవాలు తారుమారు చేయడం అనంత్ సహించడు. "ప్రేమలేఖ లెక్కడ రాశాను?".

"పువ్వులతో బాటు పంపిన కార్డు మీద 'ప్రేమతో' అని ప్రింటులో లేదూ? పైగా అన్ని పూలా? మా ఆవిణ్ని పూలతో అభిషేకం చేద్దామనుకుంటున్నావా? ఇలా న్యూసెన్సు చేసే వాళ్లను వదిలి పెట్టడం నాకు చేత కాదు" అరిచాడు కుబేరుడు.

"నాకూ చేతకాదు" అని వినబడింది. అనంత్ వెనుకనుండి. తిరిగి చూస్తే ఓ భారీ స్త్రీ. దుర్గమ్మగారు కావచ్చు.

"ఇంకా చూస్తూ నిలబడతారేం? మా తమ్ముడి కాళ్లు విరక్కొట్టి వాడికి సేవ చేసినట్టు నటించి నన్ను వలలో వేసుకుందామని చూస్తున్నవాడితో ఇంకా ముచ్చట్లేమిటి?" అంటూ ఆవిడ ఉసిగొలపడమేమిటి, కుబేరరావు అనంత్ మీదకు ఉరకడమేమిటి రెండూ ఒకేసారి జరిగాయి. కానీ ఈ లోపునే అనంత్ పుటికీలు కొట్టుకునే పాత టెన్నిస్ బాల్ కుబేరరావు ప్రయత్నాలకు గండి కొట్టింది. వచ్చి అతని పాదాల కింద పడింది. కుబేరరావు గోడవైపుకి దూసుకుపోతూండగానే అనంత్ ఆ గదిలోంచి బయటపడి, బయటనుండి గడియ పెట్టేయడం జరిగింది.

ఆ తరువాత ఐదు నిమిషాలలోపున కట్టుబట్టలతో, జేబులో క్రెడిట్ కార్డుతో అనంత్ బెంగుళూరు పారిపోయేడు, అచలపతికి తన సామ్రాజ్యం అప్పజెప్పి. ఈ దంపతులు, ఆ క్షతగాత్రుడు ఇల్లు ఖాళీ చేసేకనే తనకు కబురు చేయమన్నాడు.

***

పదిహేను రోజుల తర్వాత బెంగుళూరులో టాక్సీలో వెళుతుండగా 'దుర్గా సూప్స్' అని ఓ పెద్ద బోర్డు అనంత్ కంటపడింది. పైన 'చూస్తే ఆగలేరు' అని కాప్షన్. దాని కింద ఆకలి చూపులతో ఓ సూప్ బౌల్ కేసి చూస్తున్న ఓ ఆత్రగాడి బొమ్మ. బొమ్మ ఎక్కడో చూసినట్టు, అతనికి తనకీ పోలికలు ఉన్నట్టు అనిపించింది అనంత్‌కి. కొద్ది సేపట్లోనే తట్టింది - అది తన బొమ్మేనని ! రమ్య వేసి ఇచ్చిన కళాఖండం ఇలా బజార్న ఎలా పడిందో అతనికి అర్థం కాలేదు.

వెంటనే విమానంలో ఇంటికొచ్చి పడ్డాడు. అచలపతి తలుపు తీస్తుండగానే గంభీరంగా మొహం పెట్టి, "అచలపతీ, సంగతేమిటి?" అన్నాడు.

"పోస్టరా, సర్? రెస్పాన్స్ చాలా బాగుందిట సర్. సూప్ అమ్మకాలు కూడా పెరిగాయట".

"అమ్మకాల మాట అడగలేదు నేను. నా బొమ్మ దాంట్లో... ఎలా... అందునా అంత దారుణమైన పోజులో..." అనంత్‌కి మాటలు దొరకటం లేదు.

"సర్, ఏదో ఒకటి చేసి కుబేరరావుగార్ని, దుర్గగార్ని ఊరుకోబెట్టమన్నారు కదా..."

"అంటే మాత్రం? ఇలా బొత్తిగా నా బొమ్మ వీధుల కెక్కించి..."

"..ఊరుకోబెట్టడం చాలా కష్టమైంది సర్. దుర్గగారు రెచ్చగొట్టడం వలన కుబేరరావు గారు మరీ రెచ్చిపోయారు. ముఖ్యంగా గోడకు గుద్దుకుని ముఖం బద్దలయి, కాలు బెణికి మంచం మీద పడివుండడంతో మరింత కసిగా ఉన్నారు. డామేజి కేసు పెట్టి మిమ్మల్ని శంకరగిరిమాన్యాలు పట్టించందే వదిలి పెట్టనన్నారు. వాటిల్లో చాలా అనుభవం ఉందిట. చాలా సంపాదించాడట కూడా...."

"...అయితే మాత్రం, బొత్తిగా నా బొమ్మను.... రమ్య నా మీద గౌరవంతో వేసి ఇచ్చిన బొమ్మను... అవమానించి"

"..మంచం మీద నుండి లేచిన రోజునే కుబేరరావు గారు ఆ బొమ్మ చూడడం సంభవించింది. హాల్లో దాన్ని పెట్టాలనే మీ కోరికను ఆ ముందురోజే నేను తీర్చగలిగాను. బొమ్మ చూస్తూనే ఆయన ఆలోచనలో పడ్డారు. ఆయన ఆలోచన చూసి నేనే సజెస్టు చేశాను. ఇలా పోస్టరు డిజైన్ చేసి, మార్కెట్ చేస్తే వాళ్ల సూప్స్ బాగా అమ్ముడుపోతాయని. ఆయనకి ఆ ఐడియా నచ్చింది. ముఖ్యంగా బొమ్మలో ఆకలి చూపులు ఆయన్ని ఆకర్షించాయి."

"కానీ... ఆ బొమ్మ మీద కాపీరైట్ రమ్యది. ఆమెకు చెప్పకుండా అలా ఉపయోగించడం నేరం. కళకు ద్రోహం చేయడం..."

"చెప్పకపోవడం ఏమీ లేదండి... రమ్యగారిని రప్పించారు. ఫల్గుణరావు ఆమె ప్రతినిధిగా వ్యవహరించి బావగారితో బాగా బేరాలాడి రమ్యగారికి మంచి రేటు ఇప్పించాడు. ఆవిడ హక్కులు వదులుకున్నారు."

"ఫల్గుణరావుకి అంత నేర్పు ఉందా? ఏదీ ఆ గ్రీకు వీరుడితో బేరాలాడేటంత దమ్ము ఉందా? ఆశ్చర్యంగా ఉందే?"

"సుమనోహరిగారూ అదే అన్నారండి. అంటూనే ముచ్చటపడ్డారండి. అటువంటివాడికి భార్యగా ఉండడానికి పెట్టి పుట్టాలన్నారండి".

"అంటే?"

"అవునండి. సుమనోహరి గారు రాంపండు గారికి టాటా చెప్పేసి ఫల్గుణ్‌గారిని పెళ్లాడ బోతున్నారండి".

అనంత్ కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. కథలో మలుపులు అర్థం చేసుకోడానికి, జీర్ణించుకోవడానికి కాస్త టైము పట్టింది. "సుమనోహరికి ఫల్గుణుడు దక్కాడు. రమ్యకి డబ్బులు దక్కాయి. కానీ మధ్యలో నా బొమ్మ వాడనివ్వడం వల్లన నాకు కలిసి వచ్చింది ఏమిటి?"

"కోర్టుల చుట్టూ తిరగనక్కరలేకపోవడం" అన్నాడు అచలపతి మంచినీళ్లు అందిస్తూ.

